క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం రాత్రి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కలిశారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం.

అభినందనలు



నిజాంసాగర్(జుక్కల్): పైరవీలకు తావులేకుండా నూతన పద్ధతితో మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్యను ఎంపిక చేయడం పట్ల జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే, మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు పోటీపడటంతో మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఇంటర్వ్యూలు తీసుకొని సౌజన్యను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే మంత్రికి తెలిపారు.

నియామకం



భిక్కనూరు: ఉస్మానియా యూనివర్సిటీ స్టడీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో బోర్డ్ ఆఫ్ స్టడీ సభ్యుడిగా భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన గోల్కొండ భూపాల్‌రెడ్డి బుధవారం నియమితులయ్యారు. ఈమేరకు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కుమార్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. భూపాల్‌రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ పట్టాను గతంలో పొందారు. ప్రస్తుతం అదే యూనివర్సిటీలో స్టడీ సభ్యుడిగా నియమితులయ్యారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

బీసీల సమరభేరి పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: బీసీల సమరభేరి పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే బీసీల సమరభేరి విజయవంతం చేయాలని ఆయన అన్నారు. బీసీల సంఘం అధ్యక్షుడు శంకర్, బీసీ సంఘం నాయకులు తిరుపతి, రాములు, పోచయ్య తదితరులున్నారు.

చెక్కుల పంపిణీ




సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు 16 గ్రామాల్లో 34 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి మాట్లాడుతూ... లబ్ధిదారులకు రూ.9 లక్షల 63వేలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంగ్యా నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాదొద్దీన్, విండో చైర్మన్ సదాశివరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో..



రామారెడ్డి: కన్నాపూర్, రామారెడ్డి, రంగంపేట గ్రామాలలో లబ్ధిదారులకు రూ.4 లక్షల 50 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవుఫ్, గిద్ది ప్రవీణ్ గౌడ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ పంపిణీ చేశారు. 11 మందికి రూ. 2,31,000 విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. నాయకులు జొన్నల రాజు, పూల్ సింగ్, నరేష్, లక్ష్మారెడ్డి, ఎల్లయ్య, కొడ రవి, గోపాల్, జబ్బాని రవి, తదితరులున్నారు.

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరేనా?

- రిక్షాలను మూలన పడేసిన గ్రామ పంచాయతీలు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



పిట్లంలో మూలనపడ్డ స్వచ్ఛ భారత్ రిక్షాలు

పిట్లం(జుక్కల్): దేశాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిశుభ్రమైన దేశం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రధాని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పథకాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలలో సంపూర్ణంగా అమలు చేయాలని ప్రధాని పేర్కొన్నారు. లక్ష్య సాధన కోసం ప్రతి రాష్ట్రంలో ఆయా రాష్ట్రాల సీఎంలు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం గ్రామాలలో ఉండే చెత్తను వెంట వెంటనే తరలించడానికి ప్రతి పంచాయతీకి స్వచ్ఛ భారత్ రిక్షాలు అందజేసింది. చెత్త తరలించే ట్రాక్టర్లు వెళ్లలేని కాలనీలలో చెత్తను తీసుకెళ్లడానికి రిక్షాలు పంపిణీ చేశారు. గతంలో 40 రిక్షాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. పిట్లం పంచాయతీకి 12 రిక్షాలను పంపిణీ చేయగా వారు 4 రిక్షాలను మాత్రమే కొన్ని రోజులు వాడి వదిలేశారు. మిగతా గ్రామాలలో రిక్షాలను మూలన పడేశారు. అంతేగాక కొన్ని గ్రామాలలో అయితే రిక్షాలను మురికి, చెత్తాచెదారం ఉన్న ప్రాంతాలలో వదిలేశారు. గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చే రిక్షాలకు ఈ గతి పట్టడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని దేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న నినాదం ఇలా మురికి గుంతల పాలవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజూ పనులకు ఉపయోగిస్తే రిక్షాలు బాగుంటాయని, లేదంటే అవి తుప్పు పట్టి పనికి రాకుండా పోతాయనే విషయం అధికారులకు తెలియదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని రిక్షాలను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్త కుండీలా మారిన స్వచ్ఛ భారత్ రిక్షాలు

ప్రజా పాలనపై సాంస్కృతిక ప్రదర్శన



మాచారెడ్డిలో పాటలు పాడుతున్న కళాకారులు

మాచారెడ్డి: ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కాలంగా అమలు చేసిన ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారెంటీలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలపై బుధవారం మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు చౌరస్తా, ఎల్లంపేట గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి బాబు, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు, సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



తాడ్వాయి(తాడ్వాయి): విద్యార్థులు ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదవాలని మోటివేషనల్ స్పీకర్ సంజీవులు అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం మోటివేషన్ క్లాసులను బోధించారు. ప్రతి ఒక్క విద్యార్థి కాలయాపన చేయకుండా చదువుపై ధ్యాస పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఉన్నతస్థాయికి ఎదిగి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. ప్రిన్సిపల్ ఆదిస్వామి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి



పుస్తక ప్రదర్శన స్టాల్ వద్ద ప్రిన్సిపల్ మాధవి

భిక్కనూర్: విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం అలవాటు చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ మాధవి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చివరి రోజు బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్స్‌పాల్ మాధవి మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో మేధా శక్తిని పెంపొందించుకోవచ్చని, చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదవడం ద్వారా వారి అలవాట్లను నేర్చుకోవచ్చన్నారు.అనంతరం ఇన్‌స్పైర్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు లైఫ్ స్కిల్స్, సెల్ఫ్ డెవలప్మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ కన్వీనర్ సురేందర్, ఏటీపీ ప్రమదాదేవి, డిప్యూటీ వార్డెన్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సభ్యుల కోసం సర్వే



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్‌లో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో వీవోఏలు ఇంటింటికి తిరుగుతూ మహిళా సభ్యుల సర్వే చేపట్టారు. డ్వాక్రా సంఘంలో చేరకుండా ఇంటికి పరిమితమైన మహిళలను కలిసి సంఘంలో చేరే విధంగా ప్రోత్సహిస్తున్నారు. వీవోఏలు ఈశ్వర్, భూమయ్య, జ్యోతి, స్వరూప, గ్రామ సంఘం అధ్యక్షులు శ్వేత తదితరులున్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాధన సంస్థ ప్రతినిధులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె, బోనాల్ గ్రామాల్లో బుధవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాలల హక్కులపై ఆయా పాఠశాలల్లో సాధన సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో బాలల హక్కులపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా లేని సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..



జిల్లా కేంద్రంలో విద్యార్థుల మానవహారం

కామారెడ్డి టౌన్: బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం మానవహారం చేపట్టారు. బాల బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ప్లకార్డులు, నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు నవీన్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



బాన్సువాడ రూరల్: ఎయిడ్స్‌పై ప్రజలు అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉండాలని వైఆర్‌జీ కేర్ నిజామాబాద్ జోనల్ సూపర్‌వైజర్ రజిత సూచించారు. బుధవారం బోర్లం జీపీ కార్యాలయంలో ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో కండోమ్ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి సాయికుమార్, సీఎల్‌డబ్ల్యూ భావన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం జుక్కల్ నియోజకవర్గం మాల సంఘం నూతన కమిటీని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి మైసయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాగ్మారే అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మంతోళ్ల రాములు, ఉపాధ్యక్షులుగా గైని జైపాల్, ప్యారారం మైసయ్య, కోశాధికారిగా యాదవ్, సలహాదారులుగా బ్యాగారి చిన్న సాయిలు, విఠల్, జాయింట్ సెక్రటరీగా బెతే రవి, బ్యాగరి శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు అయ్యాల సంతోష్,చిన్న సాయిలు, పోతురాజు లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ అన్నారు. బుధవారం కళాశాలలో ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులతో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. అధ్యాపకులు శంకరయ్య, కృష్ణప్రసాద్ తదితరులున్నారు.

కాలువపై పైపు ఏర్పాటు

ఎల్లారెడ్డిరూరల్: వెంకటాపూర్‌లో పంట కాలువకు సంబంధించిన నీరు రోడ్డుపై పారడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు మున్సిపల్ కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణకు విన్నవించడంతో సత్యనారాయణ తన స్వంత ఖర్చులతో గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా పైపులైను ఏర్పాటు చేసి ఇబ్బందులను దూరం చేశారు. ఆయనకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు బీరువా, పుస్తకాల వితరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటకు చెందిన చకిలం ప్రవీణ్‌కుమార్ తన తల్లి ఉశీలమ్మ జ్ఞాపకార్థం బుధవారం మండలంలోని కన్నారెడ్డి ప్రాథమిక పాఠశాలకు బీరువాతోపాటు విద్యార్థులకు నోటుబుక్కులను వితరణ చేశారు. ప్రతి యేడు ప్రవీణ్‌కుమార్ తన తల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం మండలంలోని ఒక ప్రభుత్వ పాఠశాలకు రూ.10వేల విలువ గల సామగ్రిని అందజేస్తారు. పాఠశాల హెచ్‌ఎం సంతోష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని గోసంగివాడలో బుధవారం బోరుమోటార్‌ను బిగించినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాలనీలో తాగునీటి ఇబ్బంది ఉందని కాలనీవాసులు వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. సమస్య తమ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి కొత్త బోరుమోటర్ బిగించినట్లు వివరించారు. పంచాయితీ కార్యదర్శి యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ కిషన్ సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ గడ్డి విరాళం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వర ఆలయానికి పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ ట్రాక్టర్ గడ్డిని విరాళంగా బుధవారం అందజేశారు. ఆలయానికి చెందిన కోడె దూడలకు ఆహారంగా ఈ గడ్డిని వినియోగించాలని కోరారు. దాతకు అభినందనలు తెలుపుతూ స్వామివారి ప్రసాదాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌లు అందజేశారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఎంఈవో తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు. వడ్డిస్తున్న భోజనం, అక్కడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రణాళిక ప్రకారంగా విద్యాబోధన చేయాలని టీచర్లకు సూచించారు. టీచర్లు సమత, సుమ తదితరులున్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): రాజుల్లాలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ కార్యదర్శి శ్రావణ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందని, రైతులు వడ్లను దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు.

మాలల సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి ఇంటి గడప నుంచి మాలలు, ఉపకులాలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మాల ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కిషన్, కో-చైర్మన్‌లు వెంకటేశం, నాగరాజు, అమృత్, నాయకులు సుధాకర్, రాజు, లింగం, సత్యం, భూపతి పాల్గొన్నారు.

వరి కొయ్యలు తగలబెట్టొద్దు



విత్తన బ్యాగులు పంపిణీ చేస్తున్న ఏవో ఫయాజుల్లా



వెల్లుట్లపేటలో మాట్లాడుతున్న ఏవో నదీమొద్దిన్

బాన్సువాడ రూరల్: వరి పంట నూర్పిళ్ల తర్వాత కొయ్యలను తగలబెట్టొద్దని, దీనివల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని మండల వ్యవసాయాధికారి ఫయాజుల్లా అన్నారు. బుధవారం కోనాపూర్ క్లస్టర్ రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. వరి కొయ్యలకు నీరుపెట్టి డీకంపోజర్ చల్లి కలియదున్నాలన్నారు. దీనివల్ల భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం వ్యవసాయ విస్తర్ణాధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి 100 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. నాయకులు జెట్టి హన్మాండ్లు, తిరుపతిరావు, సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: వరి కొయ్యలను తగల బెట్టవద్దని మండల వ్యవసాయ అధికారి మహ్మద్ నదీమొద్దిన్ అన్నారు. బుధవారం వెల్లుట్ల పేటలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు గణపతి, హన్మాండ్లు తదితరులున్నారు.

కుక్కలను నియంత్రించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ పరిధిలో కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి మాజీ వార్డు సభ్యులు అక్బర్, లయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, నిత్యం ఏదో ఓ చోట స్థానికులు, పిల్లలపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని అన్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, వెంటనే కుక్కలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించాలని విన్నవించారు. సమస్య పరిష్కారిస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

బాన్సువాడ: మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ అన్నారు. బుధవారం బాన్సువాడలో భారీ ఎత్తున ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. బస్ డిపో నుంచి ప్రారంభమైన ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు జీవన భృతి కోల్పోయారని అన్నారు. జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు జీవన భృతి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యను ఉన్నతాధికారులకు పంపిస్తామని సబ్ కలెక్టర్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు, ఆటో డ్రైవర్లు చాంద్, అఫ్సర్, విజయ్, మల్లేష్ తదితరులున్నారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి అండర్ -14 విభాగంలో బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన వారికి నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 25న హాకీ పోటీలు నిర్వహించి అందులో నుంచి రాష్ట్ర స్థాయి ఎంపిక చేస్తారని ఆర్గనైజింగ్ సెక్రెటరీ నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీపాద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హీరాలాల్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి, పీడీలు లక్ష్మణ్, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

25న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అండర్-8, 10, 12 బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. అండర్-8 క్రీడాకారులకు 50, 300 మీటర్ల పరుగు, జావెలిన్‌త్రో, స్టాండింగ్ బోర్డు జంప్, అండర్-10 క్రీడాకారులకు వంద, 300 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, జావెలిన్‌త్రో, అండర్-12 క్రీడాకారులకు వంద, 400, 600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌ఫుట్, జావెలిన్‌త్రో అంశాల్లో ఎంపికలుంటాయన్నారు. పాల్గొనే వారు తప్పని సరిగా డ్రెస్‌కోడ్‌తో హాజరు కావాలని, వయస్సు ధ్రువీకరణ చూపాల్సి ఉంటుందన్నారు.

23న సత్యసాయి జయంతి వేడుకలు

కామారెడ్డి అర్బన్: సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఈనెల 23న స్థానిక అయ్యప్పనగర్‌లోని సత్యసాయి ఆలయంలో నిర్వహించనున్నట్టు సేవా సమితి తెలిపింది. భక్తులు హాజరై విజయవంతం చేయాలని సమితి ప్రతినిధులు కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంఈవో రాజగంగారెడ్డి

భిక్కనూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని ఎంఈవో రాజగంగారెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన, పెళ్లి, పండుగల రోజున ప్రతి ఏడాది ఒక్కో మొక్కను నాటడడంతో పాటు అవి పెరిగి పెద్దయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు ఎర్త్ వలంటీర్లుగా బాధ్యతలు అప్పగించి అందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం శ్రీనాథ్, పీడీ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.